# మిడిల్ క్లాస్ మొరాలిటీ

ప్రపంచాన్ని పతివ్రతలే పాలించే రోజుల్లో ఆడవాళ్ళు పొద్దున్నే పతిదేవుడి కాళ్ళో, మెళ్ళోని మంగళసూత్రాలో, ఈ రెండూ లేనివాళ్ళు మామూలు దేవుడి ఫొటోలో కళ్ళ కద్దుకొని కాని కళ్ళు విప్పేవారు కాదు. నేను మాత్రం ఒక కంటికి పని మనిషి, రెండో కంటికి పాలసీసా కనిపిస్తేనే కళ్ళు విప్పి కాలుకింద పెడతాను. నిన్న పొద్దున ఒక కన్ను తెరిచేను. థేంక్ గాడ్! పాల సీసాలున్నాయి. రెండో కన్ను తెరిచేను ఏవుంది? అంతా శూన్యం. పనిమనిషేదీ? రెండు కళ్లూ మళ్ళీ మూసేసుకున్నాను. నాకు సగం గుండె కొట్టుకోవడం మానేసింది. డబ్బు లేకపోతే అప్పు చెయ్యొచ్చు, లేకపోతే అడుక్కోవచ్చు. ఇల్లు లేకపోతే చెట్లకిందో, గుహల్లోనో వుండొచ్చు. అన్నం లేకపోతే ఉపవాసం వుండొచ్చు. ఉండలేకపోతే ఆకులలములు తినొచ్చు...కాని, పనిమనిషి లేకపోతే? అమ్మ బాబోయ్! అంట్లెవరు తోముతారు? నేను మట్టుకు అంట్లకోసం ఏ త్యాగం చెయ్యమన్నా చేస్తాను. కాని ఏం చేస్తాం? ఏ త్యాగం చెయ్యలేను. కాని, పిల్లల్ని కన్న పాపానికి వాళ్ళ కోసం చచ్చినట్టు అంట్లు తోమక తప్పలేదు.

ఆరు కప్పుల కాఫీతోను, అరడజను బిందెల నీళ్ళతోను అంట్లకొండ అయిందని పించేసరికి మా వాచీ కంగున ఎనిమిది అంది. మన పిల్లలే మన శత్రువులు. Most ungrateful fellows. అంట్లతో నేను అఘోరిస్తూ వుంటే, ఇంకా వంట అవలేదని నా చుట్టూ ఒకటే డాన్సులు ఎందుకూ? ఎదిగేసేరు ఒక్కొక్కరూ అడ్డగాడిదల్లాగా. తాగిన కాఫీ కప్పు కడగరు సరిగదా, తెచ్చి వాకిట్లోనైనా పడెయ్యరు. ఔను మరి జడ్జిగారి పిల్లలు.

కష్టాలు రావనీ, రాకూడదనీ నేననను. అసలు మనిషి కష్టాల్లోనే పడునుదేల్తాడన్నది నూటికి నూరుపాళ్లు నేను నమ్ముతాను. కాకపోతే ఆ వచ్చేవేవో చక్కగా తుఫానులాగా ఏ ఇరవైనాలుగు గంటలముందో చిన్న వార్నింగు ఒకటి యిచ్చి మరీ వస్తే ఏదో మన జాగ్రత్తలో మనం వుంటాం. ఎలాగైతేనేం వంట ప్రారంభించటం కుక్కరు సగం ఉడకడం, గాస్ అయిపోవడం, నాకు మతిపోవడం అన్నీ అరగంటలో జరిగిపోయేయి. దానిదేవుంది? కొన్ని వేలమంది కొద్ది నిమిషాల్లో కొట్టుకుపోలేదా!

వానరాకట, గాస్ పోకట ఎవరూ చెప్పలేరు. ఆ క్షణంలో ఇల్లంతా దులిపినా మహా అయితే బస్తాడు బూజు, బండెడు బల్లులు రాల్తాయేమోగాని పావలా డబ్బులు మాత్రం రాలవు. డబ్బుంటే ఏదైనా సాధించవచ్చు అన్నది మిగిలిన వాటిలో నిజమేమోగాని గాస్‌పట్ల వర్తించదు. అంచేత డబ్బు లేదన్న విచారం అనవసరం (గాస్ అయిపోయినప్పుడు మాత్రం

నేను జడ్జీని బదులు ఏ సి. టి. ఒ. నో, ఎస్. టి. ఒ. నో కట్టుకో నందుకు తాత్కాలికంగా ఓ క్షణం బాధపడతాను.)

కిరసనాయిలు స్టౌలో పోసింది కిరసనాయిలే అయినా అది మతాబాలా సుర సుర మండోంది కాని మండదే. కల్తీ సరుకు అమ్మినవాణ్ణి కాల్చి పారేయాలి. మరో పావలా తీసుకోని మంచి సరుకు యివ్వకూడదూ? ఆడదాని ఉసురు ఊరికేపోదు.

"స్టౌ" తో చేస్తున్న యుద్ధంలో అలిసిపోయిన నేను ఆయాసం తీర్చుకోవడాని కన్నట్టు ఆగి తలెత్తేను. ఎదురుగా రాజీ చెయ్యడానికొచ్చిన రాయబారిలా పనిమనిషి, ఈ "స్టౌ" తీసి దాని మొహంమీదికి విసిరేస్తే? మళ్ళీ కిరసనాయిలు కొనాలి. మళ్ళీ రెండో యుద్ధం చెయ్యాలి, ఏం చెయ్యాలో నేను నిర్ణయించుకునే లోపల "మూసిన కన్ను తెరవనేలేదు పిల్ల. ఆసుపత్రికి తీసుకెళ్ళాల. పది రూపాయలుంటే యివ్వం డమ్మా" అంది అది. నాకు అడుగు దూరంలోనే వున్నా. ఎక్కడో గోతిలోంచి వచ్చినట్టుంది ఆ గొంతుక. ఆ గొంతుకలో దైన్యం తప్ప దగాలేదు. నిజం తప్ప నీచంలేదు. నా కళ్ళ కెక్కిన కోపం దిగిపోయింది.

దానికి నే నివ్వాల్సింది ఎడ్వాన్సుకాదు. ఊరికే అంత కన్నా కాదు. ఫస్టున యివ్వాల్సిన జీతం ఆరోతారీకైనా యివ్వ లేదు. ఎప్పుడూ అడగని దాని చేతకూడా అడిగించుకోవలసిన వెధవ పరిస్థితి. ఛీ ఛీ ముష్టిఉద్యోగాలు దరిద్రపు రూల్సూను.

మా వారు ఎంతోమందిని విడతీసిన పాపానికేమో, శ్రీ హైకోర్టు వారు నన్నూ, మావార్నీ నాలుగేళ్ళ క్రితమే విడతీసేరు. అయితే మా వారెప్పుడూ నాదగ్గరే వుండాలన్నంత స్వార్థం నాలో లేదు. అతనక్కడున్నా మాకేలాంటి అభ్యంతరం వుండదు. జీతం ఫస్టు తారీఖునే మా మొహాన పారేస్తే. కాని ఈ నాలుగేళ్ళనుంచి డబ్బు మాకు అందడం నెలలో ఒక వారం గడిచేక మధ్యే మధ్యే ట్రాన్స్ఫరైతే మూడు నెలలపాటు జీతం అన్నమాట మరిచిపోవడం మంచిది. ఆ మూడు నెలలు యిష్టపడ్డవాళ్ళు గడ్డి తింటారు. బూతులు తిడితేకాని కదలదు జగన్నాథస్వామి రథం.

అన్ని ఫేన్లు ఆన్‌లోవున్నా టేబిలుమీది కాయితం కదలదు! ఆఫీసుల్లో అయితే దానిమీద బరువు పెట్టగానే బంతిలా పరిగెడుతుంది. యథా బరువు, తథా పరుగు.

ఏతావాతా నేను పిల్లలు ప్రతినెల డ్రాఫ్టుకోసం ఎదురు చూసే పరిస్థితిని వర్ణించడానికి శ్రీనాథుడికైనా ఆశు కవిత్వం చాలదు. అశ్రుకవిత్వం రావాలి.

ఇంతకీ అప్పుడు నా దగ్గర డబ్బు నిజంగానే లేదు. అంచేత "యింకా డబ్బు రాలేదు వీరమ్మా. ఈవేళకి ఎవరి దగ్గరైనా పుచ్చుకో. రేపో, ఎల్లుండో నేను తీర్చేస్తానని చెప్పు" అన్నాను పెద్ద భరోసా యిస్తున్నట్టు. మనసులో ఏమనుకుందో కాని మాట్లాడకుండా వెళ్ళిపోయింది. చేతిలో డబ్బులేదు. చెయ్యడానికి పనీలేదు. మధ్యాహ్నం కాలక్షేపంకోసం నేను,

పిల్లలు పేకాడుతూ కూర్చున్నాం. అప్పుడు గనక మావారుంటే. నేను ఎలా పిల్లల్ని చెడగొట్టేస్తున్నానో, అసలు పిల్లల్ని పెంచడం ఎంత ఆర్టో తనులేని ఈనాలుగేళ్ళలో పిల్లలు ఎలా ధ్వంసం అయిపోతున్నారో వగైరా అలుపులేకుండా ఆరు గంటలు లెక్చరిచ్చి ఉండేవారు. నిజం చెప్పొద్దూ అతను దగ్గర లేకపోవటం ఒక్క డబ్బు విషయం మినహాయిస్తే, మిగతా అన్ని విషయాల్లోనూ ప్రాణం సుఖంగానే ఉంది.

డబ్బులేని పేకాట అమ్మాయిలేని పార్టీలాంటిది. ప్రియురాల్లేని ప్రేమలాంటిది. డబ్బు అందేక యిచ్చుకోవచ్చునని పిల్లలు ఎకౌంట్ వేస్తున్నా ఆటమాత్రం డల్‌గానే ఉంది. చేతులో పేకేగాని థ్రిల్ లేదు. పోయి నడుంవాలుద్దాం అనుకుంటుండగా వచ్చేడు వాసు అతను మాకుక్కలు మొదలు మావారి వరకు ఫ్రెండ్.

"ఏమిటండీ బాబూ చంటిపిల్లలాట. కమాన్ రెడీకాష్" అంటూ జేబులోంచి డబ్బుతీసి అందరి దగ్గరా తలో కొంత పెట్టి కూర్చున్నాడు ఆటకి. అప్పుచేసి పేకాడ్డం ఆట లక్షణం కాదు. అతన్ని నొప్పించడం నా మతమూ కాదు. To Play or not to play అన్న డైలమా. "కొంచెంసేపు ఆడి లేచి పోండి" అన్నట్టు పిల్లలువేపు చూసి ఆట ప్రారంభించేను. డబ్బుచూసిన పేక, పెళ్ళికూతురిలా కళకళలాడుతోంది. నేను మాత్రం అయిదు జోకర్లతో All count యిస్తున్నాను. జోకర్లు ఎక్కువుంటే జోలపాటే శరణ్యం అంటున్న మా పెద్ద

వాడిమీద విసిరేసేను ముక్కలు లెక్కపెట్టుకోమని. వెనక్కి తిరిగితే కనిపించింది పనిమనిషి కూతురు పదేళ్ళది. ఎప్పుడొచ్చిందో ఏమో పుట్టిన దగ్గర్నుంచి వాయుభక్షణే చేస్తున్న బాలయోగినిలా ఉంటుంది అది.

“ఎవరికాడా డబ్బు దొరకనేదటండి. అయిదు రూపాయలైనా యిప్పించుకురమ్మంది మాయమ్మ” అందాపిల్ల నాకే వినిపించేటంత నెమ్మదిగా. అప్పుడు నాదగ్గర పదిరూపాయలున్నాయన్నమాట నిజవేఁ కాని అవి నావి కాదు పరాయివాడి సొమ్ము పనిమనిషికిచ్చేస్తే ఏం బావుంటుంది? ఆట అయిపోగానే మళ్ళీ అతని డబ్బు అతనికిచ్చేయడం మర్యాదస్తుల లక్షణం. యిప్పుడే వస్తానని చెప్పి ఆపిల్లతోపాటు పక్కగదిలోకి వెళ్ళాను. “చూడుపిల్లా, ఈ ఒక్కరోజుకి ఎలాగో గడుపుకోమను. రేపు తప్పకుండా యిచ్చేస్తాను. మీచెల్లికి మరీ అంత ఎక్కువైతే ఓసారి తీసుకురమ్మను. తెలిసిన డాక్టరుకి చూపిద్దాం” అని చెప్పి ఆపిల్లను పంపేసేను.

ఆ తరువాత తల్లీ రాలేదు, పిల్లారాలేదు. బహుశా జబ్బు తగ్గిందేమో! సాయంత్రం అరడజనుమంది ఫ్రెండ్సు వచ్చేరు ఉన్నఫళంగా సినిమాకు రమ్మని. సినిమాలంటే నాకిష్టవేఁ అయినా గుండె గతుక్కుమంది. పర్సులో పదిరూపాయలైనా లేకపోతే పక్కింటికూడా వెళ్ళనే. డబ్బులేని యిబ్బందులు వాళ్ళకి తెలీవు. చెప్పినా అర్థంకాదు. అంచేత

మా అబ్బాయిని పరిగెత్తించి పక్కవీధిలో వున్న వాడి ఫ్రెండు దగ్గర పాతికరూపాయలు అప్పు తెప్పించేను.

మన అవసరానికి పక్కవాడి జేబులో డబ్బు ఉండడాన్నే అదృష్టం అంటారు కాబోలు.

మొత్తానికి భామలు బైల్దేరేసరికి ఆరురీళ్ళ సినిమా అయిపోయింది. శ్రీరస్తు మొదలు శుభం వరకు సినిమా చూడకపోతే నిద్రపట్టని పద్మావతి ఒకటే గోల! ఈ సినిమా చూడాల్సింది శుభం దగ్గరే. చాక్లెట్లకి. చేగోడీలకి పదిరూపాయలు వదుల్చుకొని యింటర్వెల్లో యింటికొచ్చేసేం. నిన్న రాత్రి కొనుక్కున్న తలనొప్పి యింకా తగ్గలేదు.

ఇవేళ పొద్దున్నే పనిమనిషి కూతురు చచ్చిపోయిందన్న వార్త నన్ను లేపింది. ఆవార్త వినగానే నాగుండె కొంచెంసేపు కొట్టుకోవడం మానేసింది. నువ్వు యింకో క్షణంలో చచ్చిపోతావు అన్నా అంత షాక్ అవను.

"ఏఁవిటో అర్ధాయుష్షు పిల్లలు. అమ్మ, నాసని ఏడిపించడానికే పుడుతారు" అని ఆపిల్ల కావాలనే చచ్చిపోయినట్టు మాఅమ్మ కాసేపు విసుక్కుని, "యింతకీ ఆగుంటకి ఆయుర్దాయం అయిపోయింది. దాని నూకలై పోయేయి-అది వెళ్ళిపోయింది" అంది బాధతో కూడిన వేదాంతికంగా.

నూకలు నిండిపోడాలూ, ఆయుర్దాయం అయిపోడాలూ. ఏఁవిటి నాన్సెన్స్. నిన్ననే దాని దగ్గర డబ్బుంటే? భగవాన్! ఆపిల్లచావుకి ఇండైరెక్ట్‌గానైనా నేను కారణం కాదు కదా,

ఆ తల్లి కడుపు మంట నేను దూరాగ్గిపుల్ల నవలేదుకదా? మనసు భగ్గుమంది. ఎక్కడో దూరంగా వినిపిస్తున్న ఏడుపు నన్ను మండుతో సహా కుదిపేస్తోంది.

నిన్న నాదగ్గర డబ్బు లేనిమాట నిజం. కాని డబ్బు లేనంత మాత్రాన పేట మానలేదు. సినీమా మానలేదు. అన్ని సరదాలే తప్ప అవసరాలు కావు. అయినా అప్పుచేసేను. అదే అప్పు ఆపిల్లకోసం చేసివుంటే ఆపిల్ల బతికేదేమో? మన మనస్సులు ఎంత దిగజారిపోతున్నాయి!

పరువుకోసం ప్రాణం వదిలెయ్యవచ్చు. ఆ ప్రాణం నీదైతే. కాని నేను నా పరువుకోసం పనిమనిషి కూతురు ప్రాణం వదిలేసేను.

దూరంగా పనిమనిషి ఏడుపు బతికున్న మనిషి ఏడుపులా కాకుండా, ఎప్పుడో ఆ పాకలోని శవం మూలుగుతూ అతి భయంకరంగా వినిపిస్తోంది.

“పాపం! అది ఏ జన్మలో ఏ పాపం చేసిందో?” అంది మా అమ్మ విచారంగా.

అది తెలీక ఏ జన్మలో ఏ పాపం చేసినా నాకు తెలుసు నేను మాత్రం ఈజన్మలోనే తెలిసి తెలిసి చేసేను పాపం. ★